సాక్షి మెదక్

శనివారం । 7 । జనవరి । 2023



దారులన్నీ జాతర వైపే
మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో నిర్వహించిన మోతిమాత జాతర ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. 8లో



కంప్యూటర్ వదిలి.. పొలాల్లోకి
నిత్యం కంప్యూటర్ ముందు బిజీగా ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రైతు కష్టాలు తెలుసుకునేందుకు సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో పంట పొలాలను సందర్శించారు. 8లో



భగీరథ పైప్‌లైన్ లీకేజీ 9లో
అల్లాదుర్గం మండల పరిధిలోని చిల్వెర గ్రామ శివారులో వెంచర్ పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

న్యూస్‌రీల్

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన



సూచనలు చేస్తున్న ప్రతిమాసింగ్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మోడల్ కాలనీలో గల డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణాలు ఎంతవరకు పూర్తయ్యాయని చూసి పంచాయతీరాజ్ అధికారులకు సూచనలు చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పరిసరాలను శుభ్రంగా చేయడంతోపాటు గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు. చేగుంటలోని 108 నిర్మాణాలు 80 శాతం పూర్తయినట్లు త్వరలోనే లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేయిస్తున్నట్లు తెలిపారు. పరిశీలనలో పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణ, డీఈ నర్సింలు, ఇరిగేషన్ ఏఈ మమత, ఎంపీడీఓ ఆనందమేరీ, ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ టీఎస్ ఎంతగానో కృషి చేస్తుందని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పేటలో మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి కె.రాజేశ్వర్, కాంప్లెక్స్ హెచ్ఎంలు సుజాత, విజయ్‌కుమార్, విఠల్, ఎంఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌నాయక్‌లతోపాటు ఎస్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు నందయ్యగారి శ్రీనివాస్ కేలండర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణ, శంకర్, సుధీర్, ఆనంద్, కుమార్, అశోక్ రెడ్డి, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ధర్నా



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, స్కీం వర్కర్లు

నర్సాపూర్: స్కీం వర్కర్లకు నెలకు రూ.26 వేల కనీస వేతనాలు చెల్లించాలని స్కీం వర్కర్లు శుక్రవారం ఆర్‌డీఓ ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ డీఏఓ జేసీబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. మహిళలు ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ధర్నాలో నాగరాజుతోపాటు స్కీం వర్కర్లు సీఐటీయూ నాయకులు అన్నపూర్ణ, నాగరాణి, మంజుల, రేణుక, పద్మ, జ్యోతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జేపీ నడ్డాతో వర్చువల్ సమావేశం



మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు జేపీ నడ్డాతో ఈ నెల 7వ తేదీన బూత్ కమిటీ సభ్యుల వర్చువల్ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. వెల్దుర్తి పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరై బూత్ కమిటీ సభ్యులకు సలహాలు, సూచనలు చేశారు. కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా బాధ్యులు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నర్సింలు, నియోజకవర్గ నాయకుడు గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్కారు బడి.. సౌర కాంతి

ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ వెలుగులు

- తప్పనున్న కరెంట్ బిల్లుల బాధ
- 'మన ఊరు-మన బడి'లో భాగంగా ఏర్పాటు
- తొలి విడతలో 313 పాఠశాలలు ఎంపిక



మనోహరాబాద్ ప్రభుత్వ పాఠశాల

మెదక్‌జోన్: మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి చేస్తుంది. ఇప్పటికే పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా పాఠశాలలకు విద్యుత్ నిర్వహణ భారాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ఎంపిక చేసిన బడులకు సోలాల్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. దీంతో కరెంట్ బిల్లుల బాధ తప్పనుంది.

- జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా తొలి విడతలో 313 పాఠశాలలను మన ఊరు మన బడి కింది ఎంపిక చేసింది.
- ఇందుకోసం రూ. 150 కోట్లు మంజూరు అయ్యాయి. వీటి పనులకు రూ.30 లక్షలలోపు ఖర్చు చేసే బడులను నేరుగా పాఠశాల కమిటీ పనులు చేస్తుండగా రూ.30 లక్షల పైగా విడుదల చేసిన పాఠశాలలను కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేస్తున్నారు. పనులను బట్టి నిధులు విడుదల అవుతున్నాయి.
- పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంగా కార్యక్రమం మొదలు పెట్టారు.
- ఇందులో ముఖ్యంగా పాఠశాలలకు సౌర విద్యుత్ అందించాలని నిర్ణయించింది. గతంలో పాఠశాలలకు విడుదలయ్యే కొద్దిపాటి నిధుల నుంచే కరెంట్ బిల్లులు చెల్లించేవారు.
- ఫ్యాన్లు, కంప్యూటర్లు, బోరుమోటార్లకు వాడే విద్యుత్ బిల్లులు నెలనెలా తడిసి మోపడయ్యేవి.
- విద్యుత్ బిల్లులు చెల్లించడానికి ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సోలార్ విద్యుత్ వాడుకునేలా చర్యలు చేపట్టింది.
- సోలార్ పలకల ఏర్పాటుతో ప్రతీ పాఠశాలలో రెండు కిలో వాట్స్ ఉత్పత్తి చేసే సామర్థ్యం గల పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.
- ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇన్వర్టర్ల సాయంతో సోలార్ విద్యుత్‌ను నిల్వ చేసుకొని పాఠశాలల్లో అవసరం మేరకు వినియోగించుకోనున్నారు.
- సోలార్ విద్యుత్ ఉత్పత్తితోపాటు విద్యార్థులకు డ్యూయల్ డెస్కులు, అల్మారాలు, గ్రీన్ చాక్ బోర్డులను సైతం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

అవసరం మేరకు విద్యుత్



పాఠశాలల్లో ఫ్యాన్లు, కంప్యూటర్లకు, మోటార్లు నడపడానికి విద్యుత్ ఉపయోగపడుతుంది. సౌర పలకలు ఏర్పాటు చేస్తారు. విద్యుత్‌ను అవసరమైనంతగా వాడుకోవచ్చు. దీనికి సంబంధించిన సామగ్రిని ప్రభుత్వమే అందజేయనుంది. పాఠశాలల్లో సర్వే జరుగుతుంది. విద్యుత్ బిల్లుల ఇబ్బంది తప్పనుంది.
– రమేశ్, డీఈఓ

మరో కేంద్ర పథకం..

- కేంద్ర ప్రభుత్వం సైతం ఇటీవల 'ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా' (పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.
- ఈ పథకానికి ఇప్పటికే 236 పాఠశాలలకు సంబంధించిన జాబితాను పంపారు. ఇందులో ఎంపికైతే ఒక్కో పాఠశాలకు ఏటా రూ.46 లక్షలతోపాటు నాలుగేళ్లపాటు సదరు పాఠశాల అభివృద్ధికి నేరుగా కేంద్రం నుంచి నిధులు మంజూరి కానున్నాయి.
- ఈ పథకాల ద్వారా బడుల్లో అన్నిరకాల వసతులు ఏర్పాటు అయితే పేద విద్యార్థులు ఎంతో ఇష్టంగా బడికి వస్తారని పలువురు పేర్కొంటున్నారు.

'శభాష్‌పల్లి'ని ఆదర్శంగా తీసుకోవాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్



మొక్కలకు నీరు పడుతున్న శ్రీనివాస్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం నిర్దేశించిన పనులు పూర్తి చేయడంలో శభాష్‌పల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శభాష్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. క్రీడా ప్రాంగణం, డంప్‌యార్డు, నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పెంచేందుకు కృషి చేసిన సర్పంచ్ పార్వతీ సత్యం, కార్యదర్శి వీణను అభినందించారు. దాతల సాయంతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతోపాటు ఇతర పనులు నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఏపీఓ అనిల్ కుమార్, ఉప సర్పంచ్ సాయినాథ్ పాల్గొన్నారు. ఈ నెల 10 వరకు క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయాలని పీడీ శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
- సీహెచ్‌సీ, ఆలయాల నిర్మాణ పనుల పరిశీలన



డీఎంహెచ్‌ఓ చందునాయక్, కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): సీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తి అయితే రోగులకు మెరుగైన సేవలు అందడంతోపాటు సమస్యలు తీరుతాయని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో రూ.9.61 కోట్లతో నిర్మిస్తున్న సీహెచ్‌సీ భవన నిర్మాణం పనులను డీఎంహెచ్‌ఓ చందునాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీహెచ్‌సీ ఏర్పాటులో మండల ప్రజలకు సౌకర్యంగా మారుతుందన్నారు. కాంట్రాక్టర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనుకున్న సమయానికి ముందే భవనాన్ని పూర్తి చేసి అప్పగించాలని తెలిపారు.

సొంత నిధులతో నిర్మాణం..

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సొంత నిధులతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి, ఎల్లమ్మదేవి, పోచమ్మదేవి, కట్టమైసమ్మ ఆలయాల నిర్మాణం పనులకు రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీ స్వామితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం పనులకు త్వరగా పూర్తి చేసి మార్చి నెలలో విగ్రహ ప్రతిష్ఠ చేయాలని మాధవానందస్వామి సూచించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన పెద్దమ్మతల్లి ఆలయం స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ డిప్యూటీఈఈ అమరేశ్, ఏఈ ప్రభాకర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ రాజునాయక్, నాయకులు శివాంజనేయులు, సార రామాగౌడ్, శ్రీధర్ గుప్తా, ఎల్లం, అమర్‌సింగ్, రాజుయాదవ్, మల్లేశం, శాఖయ్య, దుర్గాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: విదేశాలలో ఉన్నత చదువులు అభ్యసించే నిరుపేద ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైను, పార్శీ మైనార్టీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్ కింద రుణాలు అందించనున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.20 లక్షల వరకు రెండు విడతల్లో వేతనాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేందుకు ఇంజినీరింగ్‌లో 60శాతం మార్కులు ఉండాలని తెలిపారు. డాక్టరేట్ చేసేందుకు పీజీఓల 60 శాతం మార్కులు వచ్చి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే అభ్యర్థులు 1 ఆగస్టు 2022 నుంచి 31 డిసెంబర్ 2022 వరకు ఎన్నికైన విదేశీ యూనివర్శిటిలో అడ్మిషన్ పొంది ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నిబంధనలు పాటించాలి

కేఎన్‌ఆర్ ఎస్‌పీపీఎల్ ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న హైవే సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): 161వ జాతీయ ప్రధాన రహదారిపై నిబంధనలను ప్రతీ ఒక్కరూ తప్పకుండా పాటించాలని కేఎన్‌ఆర్ ఎస్‌పీపీఎల్ ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి, ఇన్సిడెంట్ మేనేజర్ ఖాజా మోయినుద్దీన్‌లు అన్నారు. శుక్రవారం పేటలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్ స్పీడ్, పరిమితి వేగం, సర్వీసు రోడ్ల ప్రాముఖ్యత, హైవే లపై ఉన్న సూచికల ఉపయోగం వంటి అంశాలు వివరించారు. పై విషయాలు తల్లిదండ్రులకు తెలపాలన్నారు. విద్యార్థులు వాహనాలు నడపొద్దని, ఏదైనా అత్యవసర సమయాల్లో 1033తో పాటు 63039 06535, 63039 06540 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్, హైవే సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ



కుసంగిలో బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ సూచించారు. శుక్రవారం కుసంగి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రంలోని ఫుడ్ రిజిస్టర్లు, పిల్లల బరువులకు సంబంధించిన రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, చిన్నారుల బరువు, ఎత్తులను స్వయంగా తీశారు. అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో కచ్చితంగా న్యూట్రి గార్డెన్లను పెట్టాలని సూచించారు. కుసంకి గ్రామంలోని ఒకటో సెంటర్ పరిశుభ్రంగా లేదని వారిపైన శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం సీడీపీఓ హేమ భార్గవి, ధనూర సెంటర్ సూపర్ వైజర్ భారతి, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

మెదక్ కలెక్టరేట్: సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా వున్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం రాత్రి మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో ఆకలి కేకల నిరసన, నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు హాస్టళ్లలోని విద్యార్థులకు దుప్పట్లు రాలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్య దర్శి అజయ్, నాయకులు సందీప్, దుర్గేశ్, సంతోష్, బాబు పాల్గొన్నారు.

బీజేపీలో కార్యకర్తలకు తగిన గుర్తింపు

పార్టీ సీనియర్ నాయకుడు రాజశేఖర్



మాట్లాడుతున్న తాళ్లపల్లి రాజశేఖర్

మెదక్ జోన్: ఓబీసీలకు బీజేపీ ప్రాధాన్యం ఇస్తుందని, సామాన్య కార్యకర్తలు సైతం పార్టీలో నిబద్ధతతో పని చేస్తే పార్టీ వారిని గుర్తించి తగిన పదవులు ఇస్తుందని హైకోర్టు సీనియర్ న్యాయవాది, పార్టీ సీనియర్ నాయకుడు తాళ్ళపల్లి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాల్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి భాగంగా బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ , పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా నాయకులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

9న జాబ్‌మేళా

మెదక్ కలెక్టరేట్: ఈనెల 9న మెదక్ పట్టణంలోని ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ జాబ్ మేళా ఉంటుందన్నారు. శుభగృహ ప్రాజెక్ట్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పురుషులకు మాత్రమే వంద పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి ఆపై చదివి, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. నెలకు రూ.12వేల వేతనంతోపాటు ఇన్సెంటీవ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 98669 76470 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. జిల్లాలోని యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి



కేలండర్ ఆవిష్కరిస్తున్న రమేశ్‌కుమార్

మెదక్ కలెక్టరేట్: ఈసారి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో మొదటిస్థానం నిలపాలని డీఈఓ రమేశ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మెదక్‌లోని టీఎన్జీఓ భవన్‌లో టీయూటీఎస్ కేలండర్‌ను డీఈఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రణీత్ కుమార్, రాజగోపాల్ గౌడ్, రాష్ట్ర అదనపు అధ్యక్షుడు శ్రీనివాస్, భూపతి గౌడ్, నర్సింహరావు సిద్ధిరాములు, రాఘవరావు, దిలీప్ కుమార్, కిష్టయ్య దుర్గ రాములు వేణు గోపాల్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మీ ఆదరణకు రుణపడి ఉంటా

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

మెదక్ మున్సిపాలిటీ: మీ ప్రేమాభిమానాలకు రుణపడి ఉంటా... ఈ ఆదరణ ఎప్పటికీ ఇలాగే ఉంచాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె పుట్టిన రోజు వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మెదక్ పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద, మెదక్ పట్టణంలోని పసుపులేరు ఒడ్డున గల రేణుక ఎల్లమ్మ ఆలయంలో, అనంతరం వెల్‌కమ్ బోర్డు వద్ద వాసుమోటార్స్, బస్టాండ్ వద్ద పండ్ల వ్యాపారులు, కూరగాయల మార్కెట్‌లో అన్నదాన కార్యక్రమం, హెడ్ పోస్టాఫీసు వద్ద జర్నలిస్టులు, శ్రీ కోదండా రామాలయంలో నిర్వహించారు. అడుగడుగునా గజమాలలతో సన్మానించి కేక్‌లు కట్ చేయించారు. జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అలాగే మెదక్ పట్టణంలో జర్నలిస్టులు ప్రత్యేక సన్మానం నిర్వహించారు. ఎమ్మెల్యేతో శాంతికపోతాలను ఎగుర వేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు జయరాజ్, సమీయొద్దీన్, లక్ష్మీ నారాయణగౌడ్, రాగి వనజ, దొంతి లక్ష్మి, ఆరేళ్ల గాయత్రి, బట్టి లలిత, బొద్దుల రుక్మిణి, భీమరి కిశోర్, ఆర్కె శ్రీనివాస్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాగి అశోక్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్, నాయకులు బొద్దుల కృష్ణ, గోదల సాయిరాం, దొంతి ముత్యం గౌడ్, ప్రభురెడ్డి, లింగారెడ్డి, మేడి మధుసూదన్ రావు, దుర్గా ప్రసాద్, శ్రీధర్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు ఉమర్, ముజిబ్, పెద్ద ఎత్తున జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులను పట్టించుకోని అధికారులు

- నిజాంపేట జెడ్పీటీసీ కృష్ణారెడ్డి
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న హేమలతాశేఖర్‌గౌడ్

మెదక్ కలెక్టరేట్: అభివృద్ధి పనులకు మట్టి తరలిస్తే అడ్డుకునే అధికారులు.. అక్రమార్కులు వందలాది ట్రిప్పుల మట్టి తరలిస్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నార్సింగి నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ అధ్యక్షతన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు చెరువుల నుంచి మట్టి తరలిస్తే జరిమానాలు విధిస్తున్నారు. కానీ అక్రమార్కులు వందలాది ట్రిప్పుల మట్టి తరలిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావును ప్రశ్నించారు.
- మండలంలో వినియోగదారుల సమస్యలను ట్రాన్స్‌కో అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మెదక్ కొత్త కలెక్టరేట్ భవనం ఎప్పటిలోగా పూర్తవుతుందని ఆర్‌అండ్‌బీడీఈ వెంకటేశంను అడిగారు.
- రెండో అంతస్తులో సీలింగ్ పనులు జరుగుతున్నాయని, మార్చి నెలాఖరులోగా పూర్తి అవుతుందని వివరించారు. ఇటీవల రూ.9 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో కలెక్టరేట్ ప్రాంగణంలో సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు.
- మనోహరాబాద్ గెస్ట్ హౌజ్‌కు ఎందుకు తాళం వేశారని జెడ్పీచైర్‌పర్సన్ ప్రశ్నించగా లక్షలాది రూపాయల కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కరెంట్ కట్‌చేసి తాళం వేశామని ఆర్‌అండ్‌బీ అధికారి తెలిపారు.
- అలాగే రామాయపల్లి గ్రామంలోని డబుల్ బెడ్రూం వద్ద నీళ్లు రావడం లేదని సమస్య పరిష్కరించాలని మిషన్ భగీరథ ఈఈ కమలాకర్‌కు తెలిపారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలని సూచించారు.
- ఆయా శాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధి పనులను వివరించారు.
- ఉదయం 10 గంటలకు, 12 గంటలకు జరగాల్సిన సమావేశాలకు జెడ్పీటీసీలు రాకపోవడంతో వాటిని వాయిదా వేశారు. సమావేశంలో జెడ్పీసీఈఓ వెంకట శైలేష్, అల్లాదుర్గం జెడ్పీటీసీ సౌందర్య, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా అర్చక పరీక్షలు

తొలిరోజు 327 మంది హాజరు



నాచారం గుట్ట కేంద్రంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

వర్గల్(గజ్వేల్): మండల పరిధిలోని నాచారం గుట్టలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహిస్తున్న అర్చక ఆగమ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 387 మంది అభ్యర్థులకు 327 మంది హాజరయ్యారు. టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 195 మంది అభ్యర్థులకు 163 మంది, దేవస్థాన మండపంలోని పరీక్ష కేంద్రంలో 192 మంది అభ్యర్థులకు 164 మంది హాజరైనట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ కట్టా సుధాకర్‌రెడ్డి చెప్పారు.

రేపు బాల్ బాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): ఉమ్మడి మెదక్ జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియన్ అండర్-19 బాల్ బాడ్మింటన్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక చేస్తామని బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జనరల్ సెక్రెటరీ పీవీ.రమణ తెలిపారు. శుక్రవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ బీహెచ్ ఈఎల్ రామచంద్రాపురంలోని సంకల్ప్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్ ఓల్డ్ ఎంఐజీలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు క్రీడా జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు.
2జనవరి, 2003 తర్వాత జన్మించిన వారు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు బోనోఫైడ్ లేదా, పదో తరగతి మెమో , ఆధార్ కార్డు జీరాక్స్‌లను వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడా జట్లు నెల 12 నుంచి 14 వరకు ఖమ్మం జిల్లా బోనకల్‌లో నిర్వహించే 67వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటాయని తెలిపారు.
మరిన్ని వివరాలకు 9440703038, 9704746511 నంబర్లల్లో సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



మోతిమాత దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దారులన్నీ మోతిమాత జాతర వైపే

- తండాల గిరిజనం ఆలయానికే
- ఇంటిల్లిపాది తరలివచ్చి మొక్కుల చెల్లింపు



జహీరాబాద్: దారులన్నీ మోతిమాత ఆలయం వైపు దండు కట్టాయి. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో నిర్వహించిన మోతిమాత జాతర ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని గిరిజనులతో పాటు జిల్లా నలుమూలలు, ఆయా జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు ప్రత్యేకంగా వాహనాలు కట్టుకుని ఇంటిల్లిపాదితో తరలివచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 60వేల మందికి పైగా భక్తులు వచ్చారని నిర్వాహకులు పేర్కొన్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకుగాను అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తుతోపాటు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు.

దర్శించుకున్న ప్రముఖులు

మంత్రి టి.హరీష్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, క్రాంతికిరణ్, భూపాల్ రెడ్డి, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, జిల్లా కలెక్టర్ శరత్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివ కుమార్, అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి, టీఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌రావు పవార్, ఢిల్లీ వసంత్, వై.నరోత్తంలు ఆలయాన్ని సందర్శించి మోతిమాతను దర్శించుకున్నారు.

నేడు ఆంగ్ల ప్రతిభ పోటీలు

హుస్నాబాద్: తెలంగాణ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ), ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ, భారతీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆంగ్ల ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పంజా రాజమల్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతి చదివే విద్యార్థులకు మండల స్థాయిలో ఆంగ్లభాషలో స్పెల్ విజర్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీ పరీక్షలను అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు మండల స్థాయిలో ఎంఈఓలు, జిల్లా స్థాయిలో డీఈఓలు కన్వీనర్లుగా ఉంటారన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా స్థాయిలో ఈనెల 22వ తేదీన సిద్దిపేటలో, జిల్లా స్థాయి విజేతలకు ఫిబ్రవరి 13వ తేదీన రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల్లో ఆంగ్లభాషపై అభిరుచి పెంచడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి తోడ్పడుతుందన్నారు.

ఎంబీఏ సీటు ఇప్పిస్తానంటూ...

జిన్నారం(పటాన్‌చెరు): ఎంబీఏ సీటు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఘటనలో గుమ్మడిదల పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. జిన్నారం సీఐ వేణుకుమార్, ఎస్ఐ విజయ్‌కృష్ణలు చెప్పిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని బొంతపల్లికి చెందిన అఖిల్‌గౌడ్‌కు బెంగుళూరులోని క్రిస్ట్ యూనివర్సిటీలో ఎంబీఏ సీటు ఇప్పిస్తానని కడపకు చెందిన కిరణ్ మభ్యపెట్టాడు. ఏడాదికాలంగా ఆయా సర్టిఫికెట్ల పేర డబ్బు గుంజాడు. సీటు విషయం ఎప్పుడు అడిగినా దాటవేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, శుక్రవారం కిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పలు విద్యాసంస్థల సీట్లు ఇప్పిస్తామని ఇలాంటి వ్యక్తులు మోసం చేస్తారని, విద్యార్థులు ఎవరినీ నమ్మవద్దన్నారు.

అత్తతో గొడవపడి...

పిల్లలను తీసుకొని వెళ్లిపోయిన కోడలు

మనోహరాబాద్(తూప్రాన్): అత్తతో గొడవ జరిగాక కోడలు అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని లింగారెడ్డిపేటకు చెందిన మన్నె మహేష్- మహేశ్వరి దంపతులకు రెండున్నర సంవత్సరాల కొడుకు అఖిల్, 8 నెలల కూతురు అక్షర ఉన్నారు. కాగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు మహేశ్వరికి అత్తకు గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన మహేశ్వరి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయింది. దీంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం మహేశ్వరి సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మహేశ్వరి, ఆమె కుమారుడు అఖిల్(ఫైల్)

భూమిని కబ్జా చేస్తున్నారని ఆత్మహత్యాయత్నం

తూప్రాన్: తమ పట్టా భూమిని రియల్ వ్యాపారులు అక్రమంగా కబ్జా చేస్తున్నారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన భీమరి శ్రీనివాస్‌కు హుస్నేన్‌పూర్ శివారులో పట్టా భూమి ఉంది. పక్కనే ఉన్న ఘనపూర్ శివారులో భూమిని కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు తమ భూమిని సర్వే పేరుతో అక్రమంగా కబ్జా చేశారని మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. దీంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్న శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సింగోజు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన సింగోజు మురళీకృష్ణ ఆచార్యులను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు దామాషా ప్రకారం 55 నుంచి 60 శాతం వరకు శాసనసభ ఎన్నికలలో సీట్లు కేటాయించాలన్నారు. వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్‌లుగా బీసీలను నియమించాలన్నారు. బీసీల అభివృద్ధే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తానన్నారు.

మందుబాబులకు జరిమానా.. జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి శుక్రవారం జరిమానా, జైలుశిక్ష విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా పది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.25వేల జరిమానా, వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ధర్మారావు కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి గుర్తుతెలియని వ్యక్తి కింద పడి మృతిచెందాడు. గమనించిన సెక్యూరిటీ గార్డు అనిల్ విషయాన్ని మేస్త్రీ తాతయ్య నాయుడుకు చెప్పాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు 30ఏళ్ల వయసు ఉంటుందని, వివరాలు తెలిసినవారు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

బంగారు గొలుసు చోరీ

నర్సాపూర్: బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా బంగారు గొలుసు చోరీ అయ్యింది. పట్టణానికి చెందిన స్వరూప-పెంటయ్య దంపతులు శుక్రవారం పటాన్‌చెరు వెళ్లేందుకు నర్సాపూర్ బస్టాండుకు వచ్చారు. బస్సు ఎక్కుతుండగా తమ బ్యాగులో ఉన్న రెండున్నర తులాల నల్లపూసలతో కూడిన బంగారు గొలుసు చోరీ అయినట్టు బస్సు ఎక్కగానే గుర్తించి వెంటనే బస్సు దిగారు. బస్టాండ్‌లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబం ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఇంటి ముందు మృతదేహంతో బంధువులు ఆందోళన చేపట్టిన సంఘటన శుక్రవారం పాలమాకులలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏటి హరికృష్ణను అదే గ్రామానికి చెందిన కవ్వం అనిల్‌రెడ్డి రెండు రోజుల కిందట మోటర్ సైకిల్‌తో ఢీ కొట్టడంతో మృతి చెందాడు. హరికృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనిల్‌రెడ్డి ఇంటి ముందు మృతదేహం ఉంచి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని హరికృష్ణ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని స్థానిక నాయకులు, గ్రామపెద్దల హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నూతన విధానంలో వ్యవసాయం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): మారుతున్న జీవన విధానానికి అనుకూలంగా వ్యవసాయం నూతన విధానంలో చేయాలని చేర్యాల ఏడీఏ రాధిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలువురు రైతులు వెదజల్లే పద్ధతిలో సాగుచేసి వరి పొలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాకేష్, అగ్రోస్ నిర్వాహకులు మనోహర్, రైతులు పాల్గొన్నారు.



వరిలో వెదసాగు పద్ధతిని పరిశీలిస్తున్న ఏడీఏ రాధిక

శనగలో సస్యరక్షణ ఇలా..

- పూతదశలో నీటిఎద్దడి లేకుండా చూడాలి
- తెగుళ్లు సోకితే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి



మునిపల్లి(అందోల్): రబీలో శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. పంట రక్షణకు సకాలంలో చర్యలు చేపట్టకపోతే పచ్చ పురుగులు, వేరుఎండు తెగులు పంటను సోకుతాయి. దీని వల్ల దిగుబడులు తగ్గిపోతాయి. అయితే ఈ సమయంలో శనగలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎండుతెగులు..

నేలలో ఉన్న ఈ శిలీంద్రం అన్ని దశల్లో ఆశించి పంటకు నష్టం కలిగిస్తుంది. ముఖ్యంగా కాయ దశలో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి.

శనగ పచ్చ పురుగు

ఇవి మొక్కల లేత భాగాన్ని తినడంతో ఎదుగుదల ఆగిపోతుంది. నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి. పంట పూతదశలో నీటిఎద్దడికి గురి కాకుండా చూడాలి. కలుపును సకాలంలో నివారిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



పంటలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సస్యరక్షణలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదిస్తే రైతుల పొలం వద్దకు వచ్చి పంటలను పరిశీలించి పలు సూచనలు చేస్తారు. ఇప్పటి వరకు సంగారెడ్డి జిల్లాలో 13,500 ఎకరాల్లో రైతులు శనగ పంట సాగు చేస్తున్నారు. బావులు, మోటర్ల దగ్గర నీరు పారకంతో మరో వెయ్యి ఎకరాలలో పంట సాగు చేసే అవకాశం ఉంది.

– నర్సింగ్‌రావు, సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి)

పటాన్‌చెరులోనే ఎక్కువ పట్టాలు



పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు: రాష్ట్రంలోనే అత్యధికంగా పటాన్‌చెరు పేదలకు పట్టాలు ఇచ్చామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరులో 58 జీఓ కింద పట్టాల పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పాలనలో పేదలను పీల్చి పిప్పి చేశారని ఆరోపించారు. ప్రభుత్వ జాగాలో ఇళ్లు కట్టుకున్న పేదలకు కంటి మీద కునుకు లేని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి నుంచి పేదలకు విముక్తి కల్పించాలనే లక్ష్యంతో వారు నివసిస్తున్న ఇళ్లకు వారిని యజమానులు చేస్తూ పట్టాలు ఇచ్చామన్నారు. జిల్లాలో 830 మందికి జీఓ 58 ద్వారా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాలుష్య ప్రాంతంలో ఇంటింటికీ రక్షిత మంచి నీరు అందించిన ఘనంగా తమ పార్టీదేనన్నారు. పేదల కోసం రాష్ట్రంలోనే అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో 13 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, కలెక్టర్ శరత్‌కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో పల్లకీసేవ



పాపన్నపేట (మెదక్): ఏడుపాయల వన దుర్గా భవానీ మాతకు శుక్రవారం రాత్రి పల్లకి సేవ నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకొని ఆలయ చైర్మన్ సాతెల్లి బాలాగౌడ్, ఈఓ సారా శ్రీనివాస్, ధర్మకర్తల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మోహన్ రావు, పెంటయ్య, వెంకటేశం, మనెమ్మ, మనోహర్ , శ్రీనివాసరావు, యాదగౌడ్, నాగభూషణం, సాయిలు, సిద్ధిరాములు, బాగారెడ్డి, చక్రపాణి, ఆలయ సిబ్బంది సాయిబాబా, రవి కుమార్, బ్రహ్మచారి, నరేశ్‌గౌడ్, ప్రభాకర్ రెడ్డి , దీపక్ రెడ్డి, పూజారులు రావి కోటి శంకర్ శర్మ, పార్థీవ శర్మ, మురళీ మోహన చార్యులు, రామ్ శర్మ, రాజశేఖర్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఆలె భాస్కర్

బీజేపీ రాష్ట్ర బీసీ మోర్చా అధ్యక్షుడు ఆలె భాస్కర్ శుక్రవారం ఏడుపాయల వనదుర్గా భవానీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, పూజారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, నాయకులు తపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు ఆరోగ్య బీమా కల్పించాలి



యాదమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గడీల కుమార్‌గౌడ్ తదితరులు

దుబ్బాక: ఎంపీటీసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు అందజేయాలని ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. రాయపోల్‌కు చెందిన ఎంపీటీసీ బ్యాగరీ యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకుని వారు శుక్రవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మదాసు శ్రీనివాస్ కూడా యాదమ్మ కుటుంబాన్ని పరామర్శించారు.
దుబ్బాక: రాయపోల్‌కు చెందిన ఎంపీటీసీ యాదమ్మ కుటుంబానికి అండగా ఉంటామని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇటీవల ఎంపీటీసీ యాదమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణ సహాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌనిక రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వదిలి.. పొలాల్లోకి



వ్యవసాయ పొలంలో నాట్లు వేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

రామచంద్రాపురం(పటాన్ చెరు): నిత్యం కంప్యూటర్ ముందు బిజీగా ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రైతు కష్టాలు తెలుసుకునేందుకు ముందుకొచ్చారు. కోవిడ్ సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైతే ఒక్క రైతు మాత్రమే వ్యవసాయం చేసి నలుగురికి అన్నం పెట్టాడు. పదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఒక బృందంగా ఏర్పడి శుక్రవారం సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌ను సందర్శించారు. అదే సమయంలో తెల్లాపూర్‌కు చెందిన రైతు ఆంజనేయులు పొలంలో వరినాట్లు జరుగుతున్నాయి. దీంతో ఐటీ ఉద్యోగులు స్వయంగా పొలంలోకి దిగారు. ఎలా వేయాలో తెలుసుకొని మరీ నాట్లు వేశారు. ఈ సందర్భంగా పలువురు ఐటీ ఉద్యోగులు మాట్లాడుతూ రైతులు పడుతున్న కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. కోవిడ్ సమయంలో వ్యవసాయం చేయడంతో పాటు కూరగాయలు పండించడం వల్లనే అందరం ఆరోగ్యంగా ఉండగలిగామన్నారు.

వరినాట్లు వేయడం ఆనందంగా ఉంది



రైతు కష్టాలు తెలుసుకోవాలని తాము స్వయంగా వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాం. నా ఆలోచన తోటి మిత్రులకు తెలపడంతో వారు కూడా ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చారు. తాము స్వయంగా పొలాల్లోకి వెళ్లి వరినాట్లు వేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరు రైతు కష్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సుచిత్ర, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

రైతు కష్టాలు అందరూ తెలుసుకోవాలి



వ్యవసాయం చేసేందుకు రైతులు ఎంత కష్టపడతారో అందరూ తెలుసుకోవాల్సిందే. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వ్యవసాయ పనులు చేయడం అందరికీ ఆదర్శంగా నిలుస్తారు.

–మల్లెపల్లి బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్